
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 9 నవంబరు 2024



2018లో బౌద్ధస్థూపం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న బౌద్ధసన్యాసులు(ఫైల్)



శయన బుద్ధవిహార్‌కు మంచి రోజులు

- వైసీపీ నిర్లక్ష్యానికి మూలనపడిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు
- ఘంటసాలలో 100 అడుగుల శయన బుద్ధుడి విగ్రహం నిర్మించాలని నిర్ణయం
- 2017లో టీడీపీ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభం
- గత ప్రభుత్వం బిల్లులు చెల్లించక ఆగిన పనులు
- కూటమి ప్రభుత్వం రాకతో రూ.5 కోట్లకు ప్రతిపాదనలు

బౌద్ధ ధర్మానికి ప్రతీకగా నిలిచే అతి కొద్ది ప్రాంతాల్లో కృష్ణాజిల్లా ఘంటసాల ఒకటి. ఇక్కడ బుద్ధగయా తర్వాత దేశంలో గౌతమ బుద్ధుడి మహాపరి నిర్యాణానికి గుర్తుగా శయనిస్తున్న స్థితిలో 2018లో బుద్ధవిహార్ ప్రాజెక్టు నిర్మించతలపెట్టారు. నాటి టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.1.50 కోట్లు కూడా మంజూరు చేసి పనులు ప్రారంభించింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ పనులు అన్నీ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రాకతో దివిసీమ ప్రాంత చారిత్రక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కనుంది. దీనిపై ప్రత్యేక కథనం.

8లో

బీసీల కోసం కాంగ్రెస్ పోరాటం

- వైసీపీ, టీడీపీ, బీజేపీ బీసీలకు చేసిందేమీ లేదు
- వై.ఎస్.రాజశేఖరరెడ్డి బీసీల అభివృద్ధికి కృషి చేశారు
- కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం
- కాంగ్రెస్ పార్టీ కులగణనకు కట్టుబడి ఉంది
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా శాంతి నాగరాజుకు నియామక పత్రం అందజేస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల. చిత్రంలో కాంగ్రెస్ నేతలు

మచిలీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని.. భవిష్యత్తులో బీసీల కోసం పోరాటాలు చేస్తామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా శాంతి నాగరాజు ప్రమాణస్వీకార కార్యక్రమం మచిలీపట్నంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ అన్ని పార్టీలు బీసీలకు అండగా ఉంటామని చెబుతూనే బీసీలను పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు 2018లో కులగణన చేస్తామని హామీ ఇచ్చి పదేళ్ల దాటినా ఈ హామీ నెరవేర్చలేదన్నారు. ఇంతకాలంగా కులగణన చేయకుండా ఎందుకు మిన్నకుండి పోయారని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేసే ఉద్దేశం ఏ పార్టీకీ లేదన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్రంలో బీసీల కులగణన జరుగుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ప్రస్తుత సీఎం మిగతా 6లో..

ఆకాశవీధిలో..

- కృష్ణానదిపై సీప్లేన్ సెమీ ట్రయల్ రన్ అదుర్స్
- నేటి ట్రయల్ రన్‌కు విస్తృత ఏర్పాట్లు
- సీఎం చంద్రబాబు రానుండటంతో భద్రత కట్టుదిట్టం
- పర్యాటకులతో కిటకిటలాడిన పున్నమి ఘాట్



పున్నమి ఘాట్ వద్ద సీప్లేన్ సెమీ ట్రయల్ రన్



ప్రకాశం బ్యారేజీ వద్ద ఆకాశంలో చక్కర్లు కొడుతున్న సీప్లేన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ చెంతన, పున్నమి ఘాట్ తీరాన కృష్ణానదిపై శుక్రవారం సీప్లేన్ విన్యాసాలు పర్యాటకులను ఆకర్షించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సీప్లేన్ ట్రయల్ రన్‌ను ప్రారంభించడంతో పాటు సమీక్ష జరపనున్న నేపథ్యంలో శుక్రవారం సెమీ ట్రయల్ రన్ నిర్వహించారు. ఏవియేషన్ అధికారులు, సీప్లేన్ నిర్వాహకులు, జిల్లా అధికారులు, పోలీసుల సమక్షంలోనే ఈ సెమీ ట్రయల్ రన్ జరిగింది. హరిత బెర్మ్‌పార్క్‌లో జరిగిన ఈ విన్యాసాలను చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం ఉదయాన్నే గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి సీ ప్లేన్‌ను తీసుకొచ్చి వాటర్‌జెట్టీ వద్ద నిలుపుదల చేశారు. ఆ తర్వాత గంటకు సెమీ ట్రయల్ రన్ జరిగింది. నీటిపై విమానం దూసుకుపోవటంతో పర్యాటకులు ఆసక్తిగా చూశారు. ప్రకాశం బ్యారేజీ, బరమ్ పార్కు, భవానీ ద్వీపం మీదుగా చక్కర్లు కొట్టింది. చివరిగా శ్రీశైలం వెళ్లింది.

నేటి ట్రయల్ రన్ ఇలా..

శనివారం ఉదయం 9 గంటలకు ప్రకాశం బ్యారేజీ దగ్గర, పున్నమిఘాట్ సమీపాన సీ ప్లేన్ ల్యాండ్ అవుతుంది. దీనిని జెట్టీ పాయింట్ వద్ద పార్క్ చేస్తారు. ముందుగా ఐఅండ్ఐ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, విమాన తయారీ సంస్థ అయిన డీ హవిలాండ్ (డీహెచ్) ఎయిర్‌క్రాఫ్ట్ ఆఫ్ కెనడా లిమిటెడ్ అధికారులు ర్యాన్ డెబ్రుస్క్, యోగేష్ గార్గ్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఆర్‌సీఎస్ ఉడాన్ సీప్లేన్లకు సంబంధించి ఏవీ ప్రదర్శిస్తారు. అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. ఆ తర్వాత ట్రయల్ రన్‌కు ఆహ్వానించిన వారిని విమానంలోకి ఎక్కించుకుని శ్రీశైలం బయల్దేరుతారు. ఈ ప్లేన్ శనివారం మధ్యాహ్నానికి శ్రీశైలం వెళ్తుంది. ఈ రన్‌తో దక్షిణ భారతదేశంలో ఈ ఘనత సాధించిన రెండో రాష్ట్రంగా ఏపీ నిలవనుంది. ఈ సీప్లేన్‌లు పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించనున్నాయి. విజయవాడ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వీటిని రూపొందించారు.

రెండున్నర గంటల్లోనే శ్రీశైలం

ఈ సీప్లేన్‌లో మొత్తం 14 సీట్లు ఉంటాయి. విజయవాడ-శ్రీశైలం మధ్య రోడ్డు, రైలుమార్గం కంటే అతి తక్కువ సమయంలో శ్రీశైలం వెళ్లొచ్చు. ఇందుకు కేవలం రెండున్నర గంటల సమయమే సరిపోతుంది.

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు కోసం

63,504 దరఖాస్తులు

అత్యధికంగా మచిలీపట్నంలో 9,813 ● అత్యల్పంగా పెదపారుపూడిలో 775

మచిలీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లాలో 63,504 దరఖాస్తులు వచ్చాయి. అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్‌ల నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతిలో ఓటు హక్కు కోసం దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 25 మండలాలు, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, గుడివాడ, ఉయ్యూరు, పెడన, తాడిగడప పురపాలక సంఘాల నుంచి దరఖాస్తులు అందాయి. ఆఫ్‌లైన్‌లో 14,345, ఆన్‌లైన్‌లో 49,159 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం గుంటూరు డీఆర్వో తుది ఓటర్ల జాబితాలను ప్రకటిస్తారు. మచిలీపట్నంలో అత్యధికంగా 9,813 మంది, పెనమలూరులో 9,572 మంది, గుడివాడలో 8,143 మంది, అత్యల్పంగా పెదపారుపూడిలో 775 మంది గ్రాడ్యుయేట్ ఓటు కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

డీఎస్సీ ఉచిత కోచింగ్ నిమిత్తం అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ఈ నెల 10వ తేదీన జరగాల్సిన స్క్రీనింగ్ టెస్ట్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

కుమార్తెకు గ్యాస్ సిలిండర్ ఇచ్చిందని

భార్య హత్య

- తలను మంచం కోడుకేసి కొట్టడంతో మృతి
- మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి రైలు పట్టాలపై పడేసేందుకు వెళ్తుండగా అడ్డుకున్న స్థానికులు
- మృతదేహం సీఎస్‌ఐ చర్చి వద్ద వదిలి పరార్
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు



పెదపారుపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తనకు చెప్పకుండా కుమార్తెకు గ్యాస్ సిలిండర్ ఇచ్చిందని భార్యను కొట్టి చంపిన ఘటన పెదపారుపూడి మండలం పాములపాడు గ్రామ శివారు దూళ్లవానిగూడెంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... వేమూరి వెంకటేశ్వరరావు (72), జయమ్మ(67) భార్యాభర్తలు. కుమార్తెకు గ్యాస్ సిలిండర్ అవసరమవ్వడంతో జయమ్మ ఇచ్చింది. తనకు చెప్పకుండా ఎందుకిచ్చావని జయమ్మతో వెంకటేశ్వరరావు ఘర్షణ పడ్డాడు. మాటామాటా పెరిగి కోపోద్రిక్తుడైన వెంకటేశ్వరరావు భార్య తలను మంచం కోడుకు బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం ఆమె మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి ఊరు పక్కన ఉన్న రైల్వే పట్టాలపై పడేసేందుకు బయలుదేరాడు. గ్రామస్థులకు అనుమానం వచ్చి నిలదీయడంతో సీఎస్‌ఐ చర్చి వద్ద మృతదేహాన్ని వదిలి వెంకటేశ్వరరావు పరారయ్యాడు. గ్రామస్థులు దుప్పట్లో ఏముందని పరిశీలిస్తే జయమ్మ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పామర్రు సీఐ శుభాకర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ పి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

'నాకు తెలియకుండానే వాట్సాప్ గ్రూపులో నన్ను ఎవరో యాడ్ చేశారు. ఆ విషయం నాకు తెలియదు. సుమారు 200 గ్రూపుల్లో నా నెంబర్ ఉంది. ఆ గ్రూపులను నేను ఎప్పుడూ చూడను. కొన్నింటిలో నుంచి బయటకు వచ్చేసినా మళ్లీ యాడ్ చేశారు.' ..నల్లగొండ నుంచి వచ్చిన ఓ యువకుడు సైబర్ క్రైం పోలీసులకు చెప్పిన మాట ఇది. వైసీపీ సోషల్ మీడియా సైకోలు చేస్తున్న మరో వికృత క్రీడకు ఇదొక నిదర్శనం. దొంగ వాట్సాప్ గ్రూపులు సృష్టించి, అందులో తెలియని, తెలిసిన వారిని సైతం యాడ్ చేసి, సీఎం, డిప్యూటీ సీఎం టార్గెట్ అసభ్యకర పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి వందల గ్రూపులు ఇప్పుడు పోలీసుల విచారణలో బయటపడగా, సుమారు 200 మందికి నోటీసులు జారీ చేశారు.

వాట్సాప్.. హ్యాండ్సప్..



వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ సోషల్ మీడియా వికృత చేష్టలు

- సీఎం, డిప్యూటీ సీఎం టార్గెట్‌గా గ్రూపుల్లో పోస్టులు
- సభ్యులుగా ఎంతోమంది అమాయకులు
- తెలియని వారిని సైతం గ్రూపుల్లో యాడ్ చేస్తున్నవైనం
- వందల్లో వెలుగుచూస్తున్న వాట్సాప్ గ్రూపులు
- సుమారు 200 మందికి సైబర్ పోలీసుల నోటీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కూటమి ప్రభుత్వంలోని మంత్రులు, వారి కుటుంబ సభ్యులు.. ముఖ్యంగా సీఎం, డిప్యూటీ సీఎంలను లక్ష్యంగా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా సామాజిక మాధ్యమాల్లో అత్యంత జుగుప్సాకరంగా పోస్టింగ్‌లు పెడుతున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు 47 కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ వేదికల్లో ఈ అసభ్యకర పోస్టింగ్‌లను కనుగొన్నారు. అయితే, కథ ఇక్కడితో ఆగిపోలేదు.

వాట్సాప్ గ్రూపుల్లో యథేచ్ఛగా

అసభ్యకరమైన పోస్టింగ్‌లను స్క్రీన్‌షాట్లు తీస్తున్న కొంతమంది వాట్సాప్‌లో ఇతరులకు పంపుతున్నారు. ఇందుకోసం వేర్వేరు పేర్లతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ గ్రూపుల్లో ఈ పోస్టింగ్‌లు చూసి ఎవరైనా, ఏదైనా వ్యాఖ్యలు చేస్తే, వాటిని కాపీ చేసుకుని అసలు పోస్టింగ్‌ల కింద పెడుతున్నారు. ఈవిధంగా ఏర్పాటు చేసుకున్న గ్రూపుల్లో వైసీపీ సానుభూతిపరులనే కాకుండా పార్టీకి ఏమాత్రం సంబంధం లేని వారి నెంబర్లను కూడా యాడ్ చేసి సభ్యులను చేస్తున్నారు. ఈవిధంగా 200 వరకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసినట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ గ్రూపులకు అడ్మిన్‌లుగా ఉన్న వారితో పాటు అందులో ఉన్న సభ్యులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వాట్సాప్‌లోనే పంపుతున్నారు. ఇప్పటికే అనంతపురం, విశాఖపట్నం, బెంగళూరు, నల్లగొండ, హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల్లో ఉన్నవారికి నోటీసులు అందజేసినట్టు తెలిసింది. గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉండటంతో పాటు పోస్టింగ్‌ల స్క్రీన్‌షాట్లను ఫార్వార్డ్ చేసినట్టు గుర్తించారు. ఇలా నోటీసులను వాట్సాప్‌లో చూసిన వారిలో 80 మంది వరకు విజయవాడలోని సైబర్ క్రైం పోలీసుల విచారణకు హాజరయ్యారని తెలిసింది. పోలీసులు వారి సెల్లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మరికొంతమంది పోలీసులకు ఫోన్లు చేసి తమకేమీ సంబంధం లేదని చెప్పి వదిలేయమని వేడుకుంటున్నారు.

తెలియకపోయినా గ్రూపులో సభ్యుడే..

విచారణకు హాజరైన తెలంగాణలోని నల్లగొండకు చెందిన యువకుడు ఈ పోస్టింగ్‌లతో తనకు సంబంధం లేదని చెప్పాడు. అటువంటప్పుడు ఆ గ్రూపులో ఫోన్ నెంబర్ ఎందుకు ఉందని పోలీసులు ప్రశ్నించారు. అడ్మిన్ ఎవరో తనకు తెలియదని యువకుడు సమాధానమిచ్చాడు. ఆ గ్రూపుల్లో వచ్చిన పోస్టింగ్‌లను తాను ఏనాడూ చూడలేదని స్పష్టం చేశాడు. పలుమార్లు గ్రూపుల నుంచి బయటకు వచ్చేసినా తిరిగి యాడ్ చేశారని చెప్పాడు. దీన్నిబట్టి కామన్ ఫ్రెండ్స్ ద్వారా తెలిసిన, తెలియని వారి ఫోన్ నెంబర్లను ఈ గ్రూపుల్లో చేర్చినట్టు పోలీసులు గుర్తించారు. విచారణకు హాజరైన వారి ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ఇన్‌స్టా, ఎక్స్ సోషల్ మీడియాలో హ్యాండలర్స్‌గా ఉంటూ అసభ్యకర పోస్టింగ్‌లు చేసిన వారికి, ఫాలోవర్స్‌గా ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నమోదు చేసిన కేసుల్లో సాంకేతికంగా దర్యాప్తు సాగిస్తున్నారు. కొన్ని కేసుల్లో ఇప్పటికే ఐపీ లాగ్ వివరాలను సేకరించినట్టు సమాచారం.

నకిలీ ఇళ్ల పట్టాలపై

నేడు తీర్పు

- వెలువరించనున్న నూజివీడు కోర్టు
- బాపులపాడు మండలంలో వంశీ హయాంలో పేదలకు పట్టాలు
- సామాజిక కార్యకర్త సూర్యనారాయణ పిటీషన్‌పై విచారణ పూర్తి

విజయవాడ/హనుమాన్ జంక్షన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పదవిలో ఉండగా పంపిణీ చేసిన నకిలీ పట్టాల వ్యవహారంపై నూజివీడు కోర్టు శనివారం తీర్పు ఇవ్వనుంది. ఈ పిటిషన్‌పై సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 2014-19, 2019-2024 మధ్య వంశీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ సమయంలో బాపులపాడు మండలంలో కొంత మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అవన్నీ నకిలీ పట్టాలని కోడూరుపాడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చందు సూర్యనారాయణ నూజివీడు కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయవాదులు కిలారు బెనర్జీ, కిలారు మిథున్‌లు దాఖలు చేశారు. దీన్ని స్వీకరించిన న్యాయస్థానం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావుతోపాటు 40 మందిని కోర్టు విచారించింది. వారి వాంగ్మూలాలు నమోదు చేసుకుంది. నాడు పంపిణీ చేసిన పట్టాలను కోర్టు పరిశీలించింది. 2019 ఎన్నికల సమయంలో లబ్ధి పొందడానికి బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో పేదలకు నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వంశీమోహన్ అప్పటి బాపులపాడు తహసీల్దార్ కె.గోపాలకృష్ణ సంతకాన్ని ఫోర్జరీ చేసి పోరంబోకు, ప్రభుత్వ భూముల్లో నివసించే పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. పేదలకు పట్టాలు ఎర చూపించి ఎన్నికల్లో ఓట్ల ద్వారా లబ్ధి పొందడానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో నకిలీ పట్టాలు తయారు చేసి తన అనుచరులతో పేదలకు అందజేశారు. పట్టాలపై సర్వే నంబరు, సరిహద్దులు లేకుండా పంపిణీ చేయడంతో ఇవన్నీ నకిలీవని దుమారం రేగింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావు ఈ విషయాన్ని బట్టబయలు చేశారు. ఫోర్జరీ సంతకాలు చేసి పట్టాలు పంపిణీ చేశారని తహసీల్దార్ నరసింహారావు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నుంచి వైసీపీలోకి మారడంతో..

టీడీపీ నుంచి వైసీపీలోకి మారడంతో ప్రధాన నిందితుడుగా వంశీ మోహన్ పేరును చార్జిషీటులో నమోదు చేయకుండా స్థానిక నాయకులను మాత్రమే చేర్చారు. కోడూరుపాడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చందు సూర్యనారాయణ నకిలీ పట్టాలు పంపిణీ వ్యవహారంపై 2023లో నూజివీడు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ కేసు వేశారు. ఈ కేసుకు సంబంధించి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో పాటు గన్నవరం మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీరాణి, పెరికీడు ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బేతాళ ప్రమీలరాణి, బడుగు ఝాన్సీరాణి తదితరులను సాక్షులుగా విచారించారు. విచారణలో నకిలీ పట్టాలు పంపిణీ చేసినట్టు కోర్టు నిర్ధారణకు వచ్చింది. దీనిపై తీర్పును శనివారం వెలువరించనుంది.



శబరిమల సేవలో ఆర్టీసీ, రైల్వే

- పెద్దసంఖ్యలో బస్సులు, రైళ్లు నడిపేందుకు ప్రణాళికలు
- 25 వరకు ప్రత్యేక రైళ్లకు రైల్వే ప్రతిపాదనలు
- నర్సాపూర్, కాకినాడ నుంచి ఆపరేషన్‌కు అవకాశం
- అద్దె ప్రాతిపదికన బస్సులు నడపనున్న ఆర్టీసీ
- నేరుగా పంబ వరకు సర్వీసులు
- గురుస్వామి, వంట మనిషికి ఉచిత ప్రయాణం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు అందుబాటులో బస్సులు, రైళ్లను నడిపేందుకు ఆయా సంస్థలు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాయి. డిసెంబరులో అయ్యప్పల తాకిడి ఎక్కువగా ఉండటంతో నవంబరు నెలాఖరుకే షెడ్యూల్స్ ప్రకటించేందుకు రైల్వే, ఆర్టీసీ ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

● గతేడాది సాధారణ రైళ్లకు అదనంగా 15 స్పెషల్ రైళ్లను విజయవాడ డివిజన్ నుంచి శబరిమలకు నడిపారు. ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో 25 వరకు ప్రత్యేక రైళ్లను నర్సాపూర్, కాకినాడల నుంచి ఎక్కువగా నడిపేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు ఆమోదించాల్సి ఉంది. దీనిపై మరో వారం రోజుల్లో స్పష్టత రానుంది.

● ఇంటర్ స్టేట్ పర్మిట్ల దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడపటం సాధ్యం కాకపోవడంతో సమూహంగా శబరిమల వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన బస్సులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమలకు భారీగా అద్దె బస్సులను ఆర్టీసీ సమకూర్చింది. ప్రైవేటు బస్సుల కంటే తక్కువ అద్దెకే బస్సులను కల్పిస్తోంది. దీనికి తోడు ఈ సమూహంతో వచ్చే గురుస్వాములు, వంట వారికి ఉచిత అవకాశం కల్పిస్తోంది. ఆర్టీసీ బస్సులు పంబ వరకు చేరుకుంటాయి. ప్రైవేటు బస్సులు పంబ వరకు వెళ్లటానికి అవకాశం లేదు. ఈ ఏడాది డిమాండ్‌కు అనుగుణంగా శబరిమలకు అద్దె ప్రాతిపదికన బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ప్లాన్ చేస్తోంది.

మైలవరంపై మాట్లాడే అర్హత జోగికి లేదు

- కొండపల్లి టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం


మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణశాఖ మంత్రి పదవి వెలగబెట్టిన ప్రస్తుత మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ సొంత ఇళ్ల నిర్మాణం చేసుకున్నాడే తప్ప ఏరోజైనా నియోజకవర్గంలో ఎన్ని జగనన్న లే అవుట్లను సందర్శించాడో, ఎంతమందికి ఇళ్లు కట్టించాడో చెప్పగలడా అని కొండపల్లి మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ, అడ్డగోలుగా భూములు కబ్జాచేసి దొంగ రిజిస్ట్రేషన్స్‌తో కొడుకును కూడా జైలు పాలు చేశాడన్నారు. రాజగోపాల్ తంతే పెడనకు, పెడన ప్రజలు తంతే మైలవరానికి దేవినేని ఉమా తంతే మరల పెడనకు పెడన నుంచి పెనమలూరుకు మారాడని అందుకే.. ఫుట్‌బాల్ ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే తాట తీస్తామని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ చుట్టకుదురు శ్రీనివాసరావు, కరిమికొండ శ్రీలక్ష్మి, మైలా సైదులు, రావి ఫణి, జనసేన నేత చెరుకుమల్లి సురేష్, అప్సర్, కొత్తపల్లి ప్రకాష్, భయ్యా రామోజీ, బసవ ఉమా, వంకా మురళీ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు దండుకున్న బీసీల ద్రోహి జోగి రమేష్ అని టీడీపీ మైలవరం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పటాపంచల నరసింహారావు దుయ్యబట్టారు.

మోటమర్రి బాబాప్రసాద్‌కు సతీ వియోగం


శ్రీదేవి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ సతీమణి మోటమర్రి శ్రీదేవి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఆరోగ్యంగానే ఉన్న ఆమె మధ్యాహ్నం నిద్రపోయిన అనంతరం సరిగా స్పందించకపోవడంతో మచిలీపట్నం ఆంధ్రా ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బాబాప్రసాద్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్‌లు పరామర్శించారు. శ్రీదేవి భౌతిక కాయాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య, బత్తిన దాసు, సీతారామయ్య, కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, గోపు సత్యనారాయణ, సనకా నాగులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా మోటమర్రి బాబాప్రసాద్‌ను పరామర్శించారు.


275 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



కంకిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈడుపుగల్లు గ్రామంలోని ఓ గోడౌన్‌లో సుమారు 275 బస్తాలు, సుమారు 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్టు పక్కా సమాచారంతో సివిల్ సప్లైస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. జాయింట్ కంట్రోల్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ బి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి పార్వతి ఘటనా స్థలానికి చేరుకొని రేషన్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈడుపుగల్లు గ్రామ పరిధిలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని, మరికొంత బియ్యం బయటకు తరలిపోయిందని, వాటి వివరాలను సేకరిస్తున్నామని తెలియజేశారు. దాడుల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఉస్మాన్, పలు గ్రామాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ దాంపత్యం..

- భార్య మృతిని తట్టుకోలేక ఆగిన గుండె


వెంకటరమణ, సుగుణవల్లి (ఫైల్)

పెడన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆలుమగల అనురాగ దాంపత్యానికి నిదర్శనం ఈ దంపతులు. భార్య మృతిని తట్టుకోలేక తల్లడిల్లిన ఆ గుండె కూడా ఆగిపోయింది. పట్టణంలోని కరణం వారి వీధికి చెందిన సింగరాజు వెంకటరమణ, సుగుణవల్లిలు భార్యాభర్తలు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేని దాంపత్య బంధం వీరిది. దురదృష్టవశాత్తు సుగుణవల్లి గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆమె మరణంతో కుంగుబాటుకు గురైన వెంకటరమణ శుక్రవారం ఉదయం మృతిచెందారు. వీరిరువురికి శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. ఆదర్శ దంపతుల మరణంతో విషాదఛాయలు అలముకున్నాయి.

అంతర్జాతీయస్థాయి గోల్ఫ్ కోర్సుకు స్థలాన్వేషణ!

- పరిశీలనలో మూలపాడు, కొండపల్లి, భవానీద్వీపం
- అమరావతిలోనూ సాగుతున్న స్థలాన్వేషణ
- 2 ఏళ్లలో ఏర్పాటుకు కసరత్తు
- సుమారు 150 ఎకరాలు అవసరం



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్‌ను క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా పలు విప్లవాత్మక నిర్ణయాలు ప్రకటించిన సీఎం చంద్రబాబు క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపైనా దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా అమరావతిలో కానీ పరిసర ప్రాంతాల్లో కానీ అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో అమరావతి ప్రాంతం హైదరాబాద్‌ను మించి అభివృద్ధి చెందుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రాజధాని ప్రాంతంలో అన్ని రంగాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. గోల్ఫ్ కోర్సు ఏర్పాటు కూడా అందులో భాగమే. గోల్ఫ్ కోర్సు ఏర్పాటుకు ఇప్పటికే స్థలాన్వేషణ ప్రారంభించారు. నాలుగైదు అనువైన ప్రాంతాలను గుర్తించి, సీఎం తుది ఆమోదం తర్వాత ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

కొద్ది రోజుల క్రితం ప్రముఖ క్రికెటర్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్‌దేవ్ సీఎం చంద్రబాబును కలిశారు. ఆ


ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ అయిన ప్రముఖ క్రికెటర్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్‌దేవ్ (ఫైల్‌ఫొటో)

సమయంలో రాష్ట్రంలో గోల్ఫ్ క్రీడను అభివృద్ధి చేయడంపై ఇరువురూ చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు క్లబ్‌ను ఏర్పాటు చేయాలని ఈ భేటీలో సూత్రప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో అనంతపురం, విశాఖపట్నంలో ప్రీమియర్ గోల్ఫ్ కోర్సు క్లబ్బులను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో కపిల్‌దేవ్‌తోపాటు విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) కూడా ఉన్నారు. గోల్ఫ్ కోర్సు ఎక్కడ ఏర్పాటు చేయాలి.. ఎంత మేర స్థలం అవసరం అవుతుంది.. ఎక్కడ స్థలం అందుబాటులో ఉంది అన్న విషయాల బాధ్యతను కేశినేని చిన్నికి అప్పగించారు.

నాలుగు చోట్ల పరిశీలన

అంతర్జాతీయ స్థాయిలో గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేయాలంటే కనీసం 150 ఎకరాలు అవసరం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద విస్తీర్ణంలో స్థలం ఎక్కడ అందుబాటులో ఉంటుందనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. భవానీద్వీపం చెంతనే ఉన్న ద్వీపాల్లో విస్తీర్ణం పరంగా పెద్దగా ఉన్న ద్వీపాన్ని పరిశీలించగా, అక్కడ వరద ముప్పు ఉంటుందని, ఖరీదైన గోల్ఫ్ కోర్సు తరచూ ముంపు బారిన పడితే నష్టతీవ్రత ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో భవానీద్వీపం ఆప్షన్‌ను పక్కన పెట్టేశారు. కొండపల్లి, మూలపాడు ప్రాంతాల్లో భూముల లభ్యత సరిపడా ఉందని, అక్కడ ఏర్పాటు చేస్తే అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలో నిర్మిస్తున్న వంతెన పూర్తయితే రాజధాని ప్రాంతానికి కూడా ఈ ప్రాంతాలు చేరువలో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అమరావతి ప్రాంతంలో కూడా పలు స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే మున్ముందు అమరావతిలో భూ అవసరాలు చాలా ఉంటాయని, ఇక్కడ భూమి ధర కూడా భారీగా ఉంటుందనే ఉద్దేశంతో మూలపాడు, కొండపల్లి వైపు అధికారులు మొగ్గుచూపుతున్నారు. కొద్దిరోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

క్రీడాంధ్రగా తీర్చిదిద్దుతాం : కేశినేని చిన్ని

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చింది. యువతను గంజాయి మత్తులో ముంచేసింది. మా ప్రభుత్వం యువతను క్రీడల వైపు మళ్లించి రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చాల్సన్న ఆలోచనతో ముందుకు వెళుతోంది. మన దేశంలో గోల్ఫ్‌కు ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం లభిస్తోంది. రాష్ట్రంలో గోల్ఫ్‌ను ప్రమోట్ చేయాలన్న ఆలోచనతో ముందుకు వెళుతున్నాం. అనంతపురంలో కియా ఉద్యోగులు చాలామంది గోల్ఫ్ కోసం బెంగుళూరు వెళ్లి వస్తున్నారు. అమరావతి కూడా మున్ముందు గ్లోబల్ సిటీగా అభివృద్ధి చెందుతుంది. అప్పుడు గోల్ఫ్‌కు డిమాండ్ బాగా పెరుగుతుంది. క్రికెట్‌లో ఐపీఎల్ మాదిరి గోల్ఫ్ ప్రీమియర్ లీగ్‌లు నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉంది. గోల్ఫ్ ప్రీమియర్ లీగ్‌లో ఏపీ నుంచి ఒక టీం ఉండాలన్నది మా ఆకాంక్ష. రెండేళ్లలో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోండి

- మార్చి 31లోగా మొదటి సిలిండర్ బుక్ చేసుకోవచ్చు
- డెలివరీ అయిన 48 గంటల్లో ఖాతాకు డబ్బులు జమ
- సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయండి



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో భాగంగా మొదటి సిలిండర్ బుక్ చేసుకోలేకపోతున్న వారు కంగారుపడాల్సిన అవసరం లేదు. చాలా మంది మహిళలు తాము బుక్ చేసుకోలేకపుతున్నామని ఆందోళన చెందుతున్నారు. సిలిండర్‌లో గ్యాస్ ఇంకా అవకపోవటం వల్ల చాలామంది బుక్ చేసుకోలేకపోతున్నారు. గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకోవటానికి మార్చి 31 వరకు సమయం ఉంది. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా ఈ విషయాన్ని మీడియాకు బులెటిన్ విడుదల చేస్తూ ప్రకటించారు. అర్హులైన వారందరికీ ఇప్పటికే ఈ పథకం కింద ఎంపికైనట్టుగా లబ్దిదారులకు మెసేజ్‌లు వచ్చాయి. ఇలా మెసేజ్‌లు వచ్చిన వారంతా కూడా ఉచిత గ్యాస్ సిలిండర్ పొందటానికి అర్హులు సిలిండర్‌ను బుక్ చేసుకోవాలంటే మాత్రం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాలి. రైస్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కాపీలను తీసుకువెళ్లి బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. బుక్ చేసుకున్న సిలిండర్ నేరుగా డెలివరీ బాయ్స్ ద్వారా ఇంటికే పంపిణీ చేస్తారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో దాని మొత్తం ధరను ఖాతాలో జమ చేయటం జరుగుతుంది. ఈ విషయంలో మహిళలు ఏవైనా సమస్యలు ఉన్నా, గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్‌లతో ఇబ్బందులు ఎదుర్కొంటే తక్షణం 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాల్సిందిగా కలెక్టర్ నిధిమీనా సూచించారు. సమీప సచివాలయంలో ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించటం జరుగుతుందని చెప్పారు.

17న విజయవాడ మారథాన్

లబ్బీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు నడకను అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 17న విజయవాడ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరామ ఫైనాన్స్ విజయవాడ మారథాన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మణి దీపక్ తెలిపారు. బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఎనిమిది మారథాన్‌లు నిర్వహించామని, ఇది తొమ్మిదవదని దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికేట్, మెడల్‌తో పాటు ప్రతి విభాగంలో విజేతలకు నగదు బహుమతి అందజేయటం జరుగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరికి టీషర్టు, ఆర్.ఎఫ్.ఐ.డి టైమింగ్ చిప్, బ్రేక్‌ఫాస్ట్ అందించనున్నట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం విజయవాడ రన్నర్స్ డాట్‌కామ్ ద్వారాగాని, 7815955123, 9885359330 నెంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

అర్ధరాత్రి 12 వరకు అనుమతివ్వండి

- డీజీపీకి హోటల్ వ్యాపారుల అసోసియేషన్ వినతి


డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం

ఆటోనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను యథాతథంగా అమలుకు సహకరించాలని కోరుతూ ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధి బృందం శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసింది. 2018, 2022లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను జత చేసి అందించినట్లు ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి స్వామి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు హోటల్, రెస్టారెంట్లు తెరిచి ఉంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన విషయాన్ని డీజీపీ వద్ద ప్రస్తావించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఉత్తర్వులను అనుమతివ్వాలని కోరామని, అందుకు ఆయన స్పందించి జీవోను విడుదల చేశారని గుర్తుచేశారు. అసోసియేషన్ ప్రతినిధులు అందించిన వినతిపత్రాన్ని పరిశీలించిన డీజీపీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏపీ హోటల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. నాగరాజు, కోశాధికారి ఇ.వి పూర్ణచంద్, విజయవాడ హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ, కార్యదర్శి రాఘవలు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన
- జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం, పీహెచ్‌సీ సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

పెదపారుపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయాన్ని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 'మీ కోసం' అర్జీల పరిష్కారం.. ఇచ్చిన ఎండార్స్‌మెంట్లు పరిశీలించారు. భూ సమస్యలకు, ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించిన ఫైళ్లు, ఆర్డీవో రిజెక్షన్స్, మ్యుటేషన్స్ ఫైళ్లు రాండమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కారం పెండింగ్ లేకుండా సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, ఆ విషయం అర్జీదారులకు తెలియజేయాలని తహసీల్దార్ రంగారావుకి తెలిపారు.

అనంతరం పెదపారుపూడిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ సందర్శించి మధ్యాహ్న భోజనం అమలు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసి విద్యార్థులతో ముచ్చటించారు. శుక్రవారం మెనూ ప్రకారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు అందించారా లేదా పరివీలించారు. పెదపారుపూడి పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ ఆరాతీశారు. రోగులకు అందుబాటులో ఉన్న మందులు పరిశీలించారు. రికార్డులు పరిశీలించి లేబరేటరీ తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ డి.సాగరిక ఆసుపత్రిలో ఓపి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను గురించి కలెక్టర్‌కు వివరించారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వై.రగంఆరావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి కలెక్టర్ వెంట ఉన్నారు.

జలక్రీడల కేంద్రానికి నిధులు మంజూరు

- ఐదేళ్ల తర్వాత ప్రారంభం కానున్న పనులు


జలక్రీడాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన నాగాయలంక జలక్రీడల కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అసంపూర్తి భవనాలను పూర్తి చేసేందుకు జిల్లా మినరల్ ఫౌండేషన్ ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2017వ సంవత్సరంలో నాటి క్రీడా మంత్రి కొల్లు రవీంద్ర నాగాయలంకలో జలక్రీడల అకాడమీ పనులు ప్రారంభించింది. అనంతరం వైసీపీ అధికారంలోకి రావటంతో పనులను పక్కన పెట్టారు. దీంతో అకాడమీ భవితవ్యం అయోమయంలో పడగా, అప్పటి వరకు అక్కడ పనిచేస్తున్న కోచ్‌లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ సమస్యను తీసుకెళ్లగా, అసంపూర్తిగా ఉన్న జలక్రీడల శిక్షణా కేంద్రాన్ని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో తాను చైర్మన్‌గా ఉన్న జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

మళ్లీ ఊపందుకోనున్న జలక్రీడలు

2016 నుంచి నాగాయలంక మండలంలో జలక్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, 2017లో ఇక్కడ జలక్రీడల కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర క్రీడా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నేతృత్వంలో భవన నిర్మాణ పనులను ప్రారంభించగా, అప్పటి నుంచి మూడేళ్లపాటు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి కోచ్‌లు వచ్చి నాగాయలంకలోని పలువురికి కెనోయింగ్, కయాకింగ్, రోయింగ్ వంటి జలక్రీడల్లో శిక్షణ ఇవ్వగా, పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. కరోనా తర్వాత శిక్షణా కార్యక్రమాలు పూర్తిగా నిలిపివేయగా, కోచ్‌లను విజయవాడకు బదిలీచేయటంతో గడిచిన మూడేళ్లుగా నాగాయలంకలో జలక్రీడల కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా జలక్రీడల కేంద్రానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటంతో మళ్లీ జలక్రీడల్లో శిక్షణ పొందే నాగాయలంక క్రీడాకారులతో కళకళలాడనుంది.


వర్సిటీ స్విమ్మింగ్ చాంప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులు

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కె.శంకరరావు, కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. వర్సిటీ పరిధిలోని ఆరు కళాశాలల నుంచి స్విమర్లు పోటీపడ్డారు. పోటీల్లో 100 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఎస్.హర్షవర్ధన్ (ప్రథమస్థానం) టి.కార్తీకేయ(ద్వితీయ), ఎం.హర్షవర్ధన్(తృతీయ), 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఎండీ పర్వేజ్ మహరూఫ్, టి.కార్తికేయలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. 50 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఎం.పర్వేజ్ మహరూఫ్, టి.కార్తికేయలు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ బీసీహెచ్ సంగీతరావు తెలిపారు. వర్సిటీ సెలక్షన్ కమిటీ సభ్యులు డి.యుగంధర్, డి.హేమచంద్రరావులు పర్యవేక్షించారు.

తైక్వాండోకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 15వరకు జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా తైక్వాండో చాంపియన్‌షిప్‌కు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.బ్లెసీ నేహ(చినవుటపల్లి డాక్టర్ ఎస్‌అండ్ ఎస్ఆర్ఐ డెంటల్ కళాశాల), వల్లూరు ప్రియా(గుడివాడ డాక్టర్ గుర్రాజు ప్రభుత్వ హోమియో కళాశాల), ఎంపీఎస్ నేహితరెడ్డి(విశాఖ ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల) విద్యార్థులను ఎంపిక చేశామని, వీరికి కోచ్ కమ్ మేనేజర్‌గా ఆర్.గుర్నాజీ వ్యవహరిస్తారన్నారు.

351/6తో అదరగొట్టిన రైల్వేస్..


అంచిత్ యాదవ్(151)

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీకే కల్నల్ నాయుడు ట్రోఫీ క్రికెట్‌లో రైల్వేస్ జట్టు అదరగొట్టింది. ఒక సెంచరీ, రెండు అర్థసెంచరీలు చేశారు. ఆంధ్రా- రైల్వేస్ జట్ల మధ్య మూలపాడు వేదికగా మల్టీ డేస్ మ్యాచ్ శుక్రవారం ప్రారంభమైంది. జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 351/6 భారీ స్కోర్ చేసింది. అంచిత్ యాదవ్ 151 పరుగులు(187 బంతుల్లో 14 ఫోర్లు, 6 సిక్స్), ఇషాన్ గోయల్ 50 పరుగులు చేసి అవుట్ కాగా, జయంత్ లఖలాన్ 58 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆంధ్రా బౌలర్లు ఇస్మాయిల్, వై.వాసు, జె.సాకేత్‌రామ్‌లు రెండేసి వికెట్లు తీశారు.

బీసీల కోసం కాంగ్రెస్ పోరాటం

(5వ పేజీ తరువాయి)

చంద్రబాబుకు బీసీలపై ప్రేమ లేదన్నారు. బీసీలను వైఎస్ రాజశేఖరరెడ్డి గుండెల్లో పెట్టుకున్నారనీ, 93 బీసీ కులాలను 143 కులాలుగా పెంచిన ఘనత వైఎస్‌కే దక్కుతుందన్నారు. కులగణన జరిగితే బీసీలు ఇతర కులాల వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. బీసీల అభ్యున్నతి కోసం పది సూత్రాలతో మాస్టర్ ప్లాన్ తయారు చేస్తానని చంద్రబాబు చెప్పినా ఇంతవరకూ అమలులోకి రాలేదన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఐదేళ్లలో 35 వేల కోట్లను విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజల నుంచీ వసూలు చేశారన్నారు.

ఇంకా రాజధాని లేని రాష్ట్రమే

పక్కనే ఉన్న తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు, తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం నేటికీ రాజధాని లేదన్నారు. గతంలో వైసీపీ, ప్రస్తుతం టీడీపీ బీజేపీతో పొత్తులోనే ఉన్నా రాష్ట్రానికి పది పరిశ్రమలు కూడా రాలేదని విమర్శించారు. గత ముఖ్యమంత్రి జగన్ నా బీసీలు అని చెబుతూ 75 వేల కోట్లను బీసీల కోసం ఖర్చు చేస్తానని చెప్పినా చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయకుండా విద్యార్థులను ఇబ్బందిపెట్టారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు న్యాయం చేయాలని ఉద్యమాలు చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షుడిగా నియమితులైన శౌంరి నాగరాజుకు కాంగ్రెస్ పెద్దలు అండగా ఉంటారని వివరించారు. మాజీ ఎంపీ జేడీ శీలం, ఏఐసీసీ సభ్యులు పోలక్‌వర్మ, గుంటూరు మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొవ్వా మోహన్‌రావు ప్రసంగించారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శౌంరి నాగరాజు మాట్లాడుతూ రానున్న మూడు నెలల వ్యవధిలో బీసీ కులాలన్నింటినీ ఏకం చేసి బీసీల అభ్యున్నతి కోసం పోరాటం చేసేందుకు సమాయత్తం చేస్తామన్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

ఆకునూరులో రీసర్వేపై గ్రామసభ


గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

ఉయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే భూ సమస్యలపై ఆకునూరులో శుక్రవారం గ్రామసభ నిర్వహించి భూయజమానుల నుంచి సమస్యలకు సంబంధించి 16 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద సర్పంచ్ గోలి వసంతకుమార్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో రీసర్వే సందర్భంగా ఏర్పడిన భూ సమస్యలను యజమానులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ సురేశ్ పాల్గొన్నారు.


దావాజీగూడెం శివాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా కుంకుమార్చన

గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం శివాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి 108 కేజీల కుంకుమతో విశేష అర్చనలు, కుంకుమాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమపూజ చేశారు.

53 మద్యం సీసాలు స్వాధీనం

ఉంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు బెల్ట్‌షాప్ నిర్వాహకులను ఉంగుటూరు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని, 53 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై యు.గోవిందు మాట్లాడుతూ, స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొణుకుమాడులో అక్రమంగా మద్యం తరలిస్తున్న అంబాల పుల్లమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 18, ముక్కపాడులో చిట్టూరి చలపతిరావు నుంచి 35 క్వార్టర్ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని వారిరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేశ్‌బాబు

సైబర్ నేరాలపై అవగాహన

ఉయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మహిళలపై వేధింపులకు పాల్పడితే చట్టప్రకారం శిక్షలు తప్పవని రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు అన్నారు. కలవపాముల శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధినేత సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ఏవో పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ : రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన బాపులపాడు జడ్పీ విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఖర్చుల నిమిత్తం శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఒక్కొక్క విద్యార్థికి రూ.500లు చొప్పున ఆర్థికసాయం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ


కేసరపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఉంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు దానికి సంబంధించి అర్జీదారులకు వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తహసీల్దార్ జాలాది విమలకుమారికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. భూ సమస్యలకు సంబంధించి ఇళ్లస్థలాల పంపిణీ ఫైళ్లు, ఆర్ఓఆర్ రిజెక్షన్స్, మ్యుటేషన్స్ ఫైళ్లను తనిఖీ చేశారు.

ఆత్కూరు గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా తయారు చేయాలి

పీఎం సూర్యఘర్ పథకం కింద ఆత్కూరు గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా తయారు చేయాలని, ఈ పథకం పట్ల ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంనుంచి నేరుగా ఆత్కూరులోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌కు చేరుకున్న ఆయన అక్కడ సమావేశపు హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తొలుత ట్రస్ట్ ఈడీ డి.పరదేశి ట్రస్ట్ చేస్తున్న కార్యకలాపాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ట్రస్ట్ ప్రాంగణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో వివిధ ట్రేడుల్లో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు.

పీహెచ్‌సీ భవనాన్ని అందుబాటులోకి తేవాలి

అనంతరం గ్రామంలో నిధులలేమితో ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఎల్డీఎం జయవర్ధన్, విద్యుత్‌శాఖ అధికారి భాస్కరరావు, నెడ్‌కాప్ అధికారి మౌలాలి, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీవో ఈ.సత్యకుమార్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, పీఆర్ ఏఈ జి.శ్రీనివాస్, పీఎం సూర్యఘర్ పథకం నోడల్ అధికారులు, ఆత్కూరు పంచాయతీ కార్యదర్శి గంటా అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లేఅవుట్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

గన్నవరం : లబ్ధిదారులందరూ మార్చిలోగా గృహ నిర్మాణాలు పూర్తిచేసుకుని త్వరితగతిన బిల్లులు పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. మండలంలోని కేసరపల్లి లే అవుట్‌ను శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెళ్లేందుకు రహదారి లేదని, తాగునీటి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ ఎస్ వెంకట్రావు, ఈఈ రత్నశేఖర్, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, తహసీల్దార్ కేవీ శివయ్య ఎంపీడీవో టి.స్వర్ణలత, హౌసింగ్ డీఏ రామోజీ నాయక్, ఏఈ ఎం. సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న విద్యార్థిని

విద్యతో పాటు ఆటలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా దినోత్సవంలో ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ ఘట్టమనేని సాయిరేవతి

ప్రసాదంపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థలు అభివృద్ధి సాధించాలంటే విద్యతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ఆటలతో శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతుందని, స్పోర్ట్స్ కోటాలో అనేక ఉద్యోగాలు వస్తాయని తెనాలి ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ ఘట్టమనేని సాయిరేవతి అన్నారు. శుక్రవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్యం ఆటల విషయంలో చాల నిబద్ధతతో ఉందని కొనియాడారు. ఆడటం ఒక యోగమని, ఆడించడం ఒక యాగమని, ఆడకపోవడం ఒక రోగమని అని అన్నారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం నుంచే ఫీల్డ్ ఈవెంట్స్ బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ వంటి ఆటలు, కరాటే, స్కేటింగ్ వంటి పలు రకాల గేమ్స్ నిర్వహిస్తామని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ తెలిపారు. క్రీడా పోటీలు, మాస్ డ్రిల్, కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె. ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భవనేశ్వ రన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్, వైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్‌కు 104 సిబ్బంది వినతి


తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 104 సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా కోశాధికారి బి.సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కెవి శివయ్య, ఎంపీడీవో స్వర్ణలతకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవటంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్మును తిరిగి ఇప్పించాలన్నారు. సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పద్మారాణి

హనుమాన్‌జంక్షన్/ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కష్టంతో కాకుండ ఇష్టపడి చదివినపుడే మంచి ఫలితాలు సాధించవచ్చని గుడివాడ డివిజనల్ ఉప విద్యాశాఖాధికారిణి (డీవైఈవో) పద్మారాణి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఫార్మేటివ్-2 పరీక్షలను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. బట్టీ పట్టే పద్ధతి కాకుండా ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదివాలని సూచించారు. మంచి ఫలితాలు రావడానికి తీసుకుంటున్న చర్యలను హెచ్ఎం నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంబాలసింగ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుపై అవగాహనతో చదవాలి

భవిష్యత్తులో చదివే కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహనతో ఇష్టపడి చదవాలని గుడివాడ ఉప విద్యాశాఖాధికారిణి పద్మారాణి విద్యార్థులకు సూచించారు. రేమల్లె హైస్కూల్‌ను శుక్రవారం రాంబాలాసింగ్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల భోజన మెనూను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లూథర్‌పాల్, ఉపాధ్యాయులు భాస్కరరావు, రవిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంకిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి అశోక్‌కుమార్ తెలియజేశారు. కంకిపాడు, ఈడుపుగల్లు గ్రామాల పరిధిలోని ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో..

గన్నవరం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గన్నవరం, మర్లపాలెం, చిన అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు సిటీ, బీబీగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, చిక్కవరం ప్రాంతాల్లో మెయింటెనెన్స్ నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉంగుటూరు విద్యుత్ సెక్షన్ పరిధిలో..

ఉంగుటూరు : ఉంగుటూరు విద్యుత్‌సెక్షన్ పరిధిలోని 33/11కేవీ నందమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు మానికొండ, నందమూరు, ఇందుపల్లి, మధిరపాడు, వేమండ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించటంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో హెచ్ఎంలు కీలకపాత్ర వహించాలని ఎంపీడీవో టి.స్వర్ణలత సూచించారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో హెచ్ఎంలతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఎంఈవో కొండా రవికుమార్ మాట్లాడు తూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికి ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ (అపార్) ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. ఎఫ్ఏ-1 పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఫలితాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. దీంతో విద్యార్థత సర్టిఫికెట్లు, టీసీలు ఇతర విద్యా సంబంధిత పత్రాలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని చెప్పారు. అనంతరం ఎంపీడీవో స్వర్ణలతను విద్యాశాఖ అధికారులు హెచ్ఎంలు సత్కరించారు. ఎంఈవోలు కమల, సురేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేత జంపాన శ్రీనివాసరావు మృతి


ఉయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జంపాన శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. జంపాన శ్రీనివాసరావు(58) శుక్రవారం ఆయన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందాడు. శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు, ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాగిత కొండ, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ నజీర్, గూడపాటి గిరిబాబు తదితరులు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


జయంత్యుత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

ధన్వంతరి జయంత్యుత్సవాలను విజయవంతం చేయండి

కంకిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 10వ తేదీన జరగనున్న ధన్వంతరి జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వణుకూరు సురేష్‌బాబు, రిమ్మనపూడి బ్రహ్మేశ్వరరావులు అన్నారు. కంకిపాడులో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయంత్యుత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు పాల్గొంటారని తెలియజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆకునూరు సుబ్బారావు, ధన్వంతరి జయంత్యుత్సవాల ఉత్సవ కమిటీ సభ్యులు అవనిగడ్డ ఆంజనేయులు, వణుకూరు విక్రమ్, తెన్నేటి ప్రకాష్, ఇంటూరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


ధ్వసమైన విగ్రహం

ఉయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు శుక్రవారం వేకువ జామున ధ్వసం చేశారు. ముఖానికి ముసుగులు ధరించిన కొందరు దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్నివాచ్‌మెన్ గమనించి వెంబడించగా ద్విచక్రవాహనంపై పరారైనట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మురళి పట్టణ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉయ్యూరు సీఐ రామారావు తెలిపారు.





కార్తీక.. కలువలు

కార్తీక మాసంలో వీటికి యమా డిమాండ్ గురూ!

(ఆంధ్ర జ్యోతి, విజయవాడ): కార్తీక కలువలివి! కార్తీక మాసంలో విరగకాసే ఈ కలువపూలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పరమ శివుడితో పాటు సాయి బాబాను పూజించటానికి వీటిని ఉపయోగిస్తారు. ధర ఎక్కువైనా దేవుడికి ప్రీతిపాత్రమైనవిగా భావించటం వల్లే అంత డిమాండ్. ఇవి అరుదుగా దొరుకుతాయి. కృష్ణాజిల్లా గన్నవరం మండలం బీబీ గూడెం గ్రామంలో కలువపూలు పెరిగే రెండు చెరువులున్నాయి. కార్తీక మాసం వచ్చిందంటే చాలు.. ఈ రెండు చెరువులు రంగురంగుల కలువపూలతో అందంగా మారిపోతాయి. ఎక్కువగా గులాబీ వర్ణం కలిగిన కలువ పూలు, కొన్ని తెలుపు, మరికొన్ని కెంపు ఇలా విభిన్న రంగుల్లో పూస్తాయి. బీబీ గూడెం గ్రామ పంచాయతీకి ఈ చెరువలపై ఏటా రూ.3లక్షల ఆదాయం వస్తుంది. ఏటా గ్రామ పంచాయతీ పాట పెట్టినప్పుడు గ్రామస్థులు పాటను దక్కించుకోవటానికి పోటీలు పడతారు. ఈ ఏడాది స్థానికులే పాటను కైవసం చేసుకున్నారు. రోజూ భారీగా కలువపూలను కోసి విజయవాడలోని పూల మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రకరకాల పూల వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు కొని తీసుకు వెళుతుంటారు. కార్తీక పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు చేసేవారు తప్పకుండా కలువ పూలను ఉపయోగిస్తారు. ఆ రోజున మార్కెట్‌లో కలువపూలకుండే డిమాండ్ అంతా, ఇంతా కాదు. ఇటీవల అయ్యప్పలు కూడా భజనల్లో కలువపూలనే ఉపయోగిస్తున్నారు.

- కృష్ణాజిల్లా బీబీగూడెం చెరువులో విరగపూసిన కలువలు
- ఏటా గ్రామ పంచాయతీకి రూ.3 లక్షల ఆదాయం
- పంచాయతీ పాటకు గ్రామస్థుల నుంచి డిమాండ్
- కార్తీక మాసంలో కోతకు వచ్చే కలువలు
- విజయవాడ పూల మార్కెట్‌కు ఎగుమతి
- పౌర్ణమి రోజున కలువ పూలతో భక్తుల పూజలు



ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసిన అసోసియేషన్ నేతలు

ఆటోమొబైల్ అభివృద్ధికి
సహకరిస్తా

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆటోమొబైల్ రంగంలో వస్తున్న సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకునేలా మెకానిక్‌లు, కార్మికులు అప్‌గ్రేడ్ అయ్యేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఆటోనగర్‌లోని అన్ని అసోసియేషన్ల అభివృద్ధికి కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కోడూరు ఆంజనేయవాసు ఆధ్వర్యంలో ఫ్యూయల్ ఇంజక్షన్ పంపు క్యాలిబ్రైటర్స్, రీ బోరింగ్ వర్క్‌షాపుల అసోసియేషన్ నేతలు గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం శివనాథ్‌ను కలిశారు. అనంతరం వారి సమస్యలను పేర్కొంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ వారి సమస్యలు విని సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఐదేళ్లుగా పనులు లేవని నేతలు చెప్పటంతో ఎంపీ స్పందిస్తూ బందరు పోర్టు, పరిటాలలో గూడ్స్ హబ్, విజయవాడలో ఇన్నర్ రింగ్ రోడ్డు, అమరావతి నిర్మాణ పనులు వచ్చే ఏడాది జనవరి నుంచి పుంజుకుంటాయని ఆటోనగర్‌కు పనులు వస్తాయన్నారు. ఫ్యూయల్ ఇంజెక్షన్ పంపు క్యాలిబ్రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.నాగేశ్వరరావు, కోశాధికారి ఎస్.సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర, జాయింట్ సెక్రటరీ ఎం.కోటేశ్వరరావు, కమ్మిలి ప్రసాద్, రీ బోరింగ్ వర్క్‌షాపుల అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.అర్జునరావు, సెక్రటరీ నాగేశ్వరరావు, ఎ.గోపిచంద్, మైత్రీ మోహన్‌రావు, ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సెక్రటరీ జాస్తి సురేష్, ఐలా మాజీ సభ్యుడు, సీనియర్ మెకానిక్ షేక్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

జీఐఎస్ సాంకేతికతో రాజధాని పనులు వేగవంతం

● సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్



కృష్ణలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి జీఐఎస్ సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతాయని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. ఎస్రీ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం జీఐఎస్ మ్యాపింగ్ టెక్నాలజీపై విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఉద్యోగులకు కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జీఐఎస్ సాంకేతికతతో నిర్మాణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తిచేయగలమన్నారు. ఈ టెక్నాలజీని ఉద్యోగులు అందిపుచ్చుకొని అత్యున్నత లక్ష్యాలను అధిగమించాలన్నారు. నిత్య జీవితంలో చరవాణితో సాంకేతికతను ఎలా పెంపొందించుకొంటున్నామో అలాగే జీఐఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా రాజధాని నిర్మాణ పనులు వేగంగా పారదర్శకంగా జరుగుతాయని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్రీ ఇండియా ప్రతినిధి డాక్టర్ రమా చక్రవర్తి జీఐఎస్ మ్యాపింగ్ వినియోగదాన్ని దృశ్య మాధ్యమం ద్వారా ఉద్యోగులకు వివరించి ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యశాలలో ఏపీ సీఆర్‌డీఏ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఎస్‌జీటీ ఉచిత శిక్షణ

● 12లోగా దరఖాస్తు చేసుకోవాలి: బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

కృష్ణలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-ఎస్‌జీటీ పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా పొందిన దరఖాస్తుకు బయోడేటా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, టెట్ మార్కుల జిరాక్సు కాపీలను సమర్పించాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదన్నారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేసి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా సందేహం ఉంటే విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని కె.శ్రీనివాసరావు సూచించారు.



శ్రీశ్రీ భవన్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నగర నేతలు

ప్రజాపోరును జయప్రదం చేయండి: సీపీఎం

గవర్నర్‌పేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14 వరకు నిర్వహించే ప్రజా పోరును జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ కోరారు. ఇందులో భాగంగా ఈనెల 14న విజయవాడ కలెక్టర్ ఆఫీసు వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ అధిక ధరలు, మద్యం నియంత్రణ, విశాఖ ఉక్కు అమ్మకం, మహిళలు, దళితులు, పిల్లలపై దాడులు, వరద బాధితులకు సాయం, స్థానిక సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపడుతున్నామన్నారు. భారాలు మోపే ప్రభుత్వాన్ని, నిరంకుశ కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, వెస్ట్ సిటీ కార్యదర్శి బి. సత్తిబాబు, ఈస్ట్ సిటీ నేత పి. కృష్ణ ప్రసంగించారు.

రేపు అఖిల భారతీయ ముదిరాజ్ సమాజ్ ఎన్నికలు

● పాల్గొననున్న రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది గురునాథం

విజయవాడ లీగల్, నవంబరు 8: ఈనెల 10న ఢిల్లీలో జరుగనున్న కోలి/ముదిరాజ్/ముత్తారయ్యర్ కులానికి సంబంధించిన ఎన్నికల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.గురునాథం పాల్గొననున్నట్టు అఖిల భారతీయ కోలీ సమాజ్ సంఘం ప్రధాన కార్యదర్శులు డీపీ శంఖ్వర్, మను భాయి ఛాడాలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10న తిరిగి సంఘానికి ఎన్నికలు జరిపేందుకు అఖిల భారత కోలి/ముదిరాజ్ సమాజ్ సంఘం నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో సిమ్లా నుంచి బీజేపీ నేత, పార్లమెంట్ మాజీ సభ్యుడు వీరేంద్ర కాశ్యప్, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉజ్జయిని మాజీ ఎంపీ సత్యనారాయణ పవర్ మధ్య పోటీ జరగనుందన్నారు. సదరు ఎన్నికల సందర్భంగా రాష్ట్రం నుంచి కోలి/ముదిరాజ్ సమాజ్ సంఘం అధ్యక్షుడైన వి.గురునాథం ఎన్నికల్లో పాల్గొనాల్సిందిగా జాతీయ కమిటీ కోరినందున ఆయన ఢిల్లీకి వెళ్లి ఓటింగ్‌లో పాల్గొననున్నట్టు తెలిపారు.

చెట్టు కొమ్మ పడి 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రసాదంపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమీపంలో ఆటలాడుతున్న విద్యార్థులపై చెట్టు కొమ్మ విరిగి పడిన ఘటనలో విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని వివేకానంద పాఠశాల ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో విద్యార్థులు ఆటలు ఆడుతున్నారు. ఆ సమయంలో సమీపంలో చెట్టు కొమ్మ విరిగి పడి విద్యార్థులు పై పడింది. ఈ ఘటనలో సూమారు 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం వెంటనే విద్యార్థులను ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. విద్యార్థులందరూ క్షేమంగా ఉండటంతో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

క్రీస్తుశకం 1, 2 శతాబ్దాలకు చెందిన ప్రాచీన బౌద్ధస్థూపం, బౌద్ధ భిక్షువులు ధ్యానం చేసుకునే ధ్యాన మందిరాలు ఇక్కడ ఉండటంతో పాటు ప్రాచీన బౌద్ధ చరిత్రకు చెందిన అనేక ఆనవాళ్లతో కూడిన శిల్ప సంపదను పరిశీలించేందుకు ఘంటసాల ప్రాంతానికి దేశవిదేశాల నుంచి చారిత్రక పరిశోధకులు తరలి వస్తుంటారు. అలాంటి ప్రాంతంలో శయన స్థితిలో ఉన్న బుద్ధుడి మందిరాన్ని నిర్మించి అందులో భారత దేశ బౌద్ధ చరిత్రకు సంబంధించిన గ్రంథాలయాన్ని, పురాతన శిల్పసంపదను, పరిశోధన కోసం అందుబాటులో ఉంచటంతో పాటు ధ్యాన మందిరం కూడా ఏర్పాటు చేస్తే పలు దేశాల నుంచి యాత్రికులు వస్తారన్న అంచనాతో పర్యాటక శాఖ ఈ ప్రాజెక్టును నిర్మించ తలపెట్టింది. గత టీడీపీ ప్రభుత్వం రూ.కోటి 50లక్షల అంచనాతో శంకుస్థాపన చేసి మొదలు పెట్టింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావటంతో ఈ బుద్ధ విహార్ ప్రాజెక్టుకు గ్రహణం వీడింది. సవరించిన అంచనాలతో పనులు పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

- అవనిగడ్డ/ఘంటసాల, ఆంధ్రజ్యోతి



శయన బుద్ధవిహార్‌కు
మంచిరోజులు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మూలనపడిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కదలిక



నిలిచిపోయిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు భవనం

- వందడుగుల శయన బుద్ధుడి విగ్రహ నిర్మాణానికి ప్రతిపాదన
- 2017లో టీడీపీ హయాంలో నిర్మాణం ప్రారంభం
- బిల్లులు చెల్లించకపోవటంతో నిలిచిన ప్రాజెక్టు
- కలెక్టర్‌తో కలిసి ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే మండలి
- రూ.5కోట్లతో అంచనాలు రూపొందించామన్న అధికారులు

దివి ప్రాంత చారిత్రక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే లా కృష్ణాజిల్లాలోని ప్రఖ్యాత బౌద్ధక్షేత్రం ఘంటసాలలో నిర్మించ తలపెట్టిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు ఐదేళ్ల వైసీపీ నిర్లక్ష్య పాలనకు బలైంది. ఈప్రాంతానికున్న ప్రాచీన బౌద్ధ చరిత్ర నేపథ్యంలో గౌతమబుద్ధుడి మహాపరి నిర్యాణానికి గుర్తుగా 2017లో ఘంటసాలలో శ యన బుద్ధవిహార్ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.1.50 కో ట్లు కేటాయించగా, ఘంటసాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు దాదాపు రూ.కోటి పైగా విలువైన 2.2 ఎకరాల స్థలాన్ని పర్యాటక శాఖకు విరాళంగా అందజేశారు. 2017, సెప్టెంబరు 16న నాటి కలెక్టర్ లక్ష్మీకాంతంతో కలిసి ప్రస్తుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. బుద్ధగయా తర్వాత దేశంలో గౌతమబుద్ధుడి మహాపరి నిర్యాణానికి గుర్తుగా శయనిస్తున్న స్థితిలో 2018, ఫిబ్రవరి 4న ఘంటసాలలో పనులు మొదలు పెట్టారు. నాటి కలెక్టర్ లక్ష్మీకాంతం, పర్యాటక శాఖ ఏడీ రేగుళ్ల మల్లిఖార్జున రావు ప్రత్యేక శ్రద్ధతో యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు జరిగాయి. దాదాపు రూ.70 లక్షల మేర ఖర్చు చేయగా, రెండంతస్థుల భవన నిర్మాణానికి కావాల్సిన స్ట్రక్చర్ మొత్తం దాదాపు పూర్తయింది.

వైసీపీ రాకతో నిలిచిన పనులు

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావటంతోనే శయన బుద్ధవిహార్ ప్రాజెక్టుపై నీలినీడలు అలముకున్నాయి. అప్పటి వరకు నిర్మించిన నిర్మాణాలకు కూడా బిల్లులు చెల్లించకుండా నిలిపేయటంతో పాటు ప్రాజెక్టును పక్కన పడేశారు.

ఘంటసాల ప్రాంత ప్రాశస్త్యం

కృష్ణాజిల్లాలో బౌద్ధధర్మానికి ప్రతీకగా నిలిచే అతి కొద్ది ప్రాంతాల్లో ఘంటసాల ఒకటి. క్రీస్తుశకం 1, 2 శతాబ్దాల్లో ఈ ప్రాంతంలో బౌద్ధమతం పరిఢవిల్లిందని ఖగోళ శాస్త్రవేత్త టోలమి, చైనా యాత్రికుడు హుయాన్ ట్సాంగ్ సైతం తమ పర్యటనలు పొందుపరిచే గ్రంథాల్లో ప్రస్తావించినట్టు చరిత్రకారులు చెబుతున్నా రు. క్రీస్తుశకం 1, 2 శతాబ్దాల్లో ఘంటసాల ఓడరేవుగా విరాజిల్లిందని, ఇక్కడున్న బౌద్ధస్థూపాన్ని 2005లో జరిగిన కాలచక్ర కార్యక్రమానికి ముందు పునరుద్ధరించారని, మరే ఇతర ప్రాంతాల్లో లేనట్టు ఇక్కడ బౌద్ధస్థూ పం నిర్మాణం విభిన్నంగా ఉంటుందని పరిశోధకులు చెబుతుంటారు. ఈ ప్రాంతం నాణేలను ముద్రించే టంకశాలగా కూడా ప్రసిద్ధి చెందిందని అంటారు.

పునఃప్రారంభమెప్పుడు..?

శయన బుద్ధ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందా అని పర్యాటకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2017లో ఉన్న ధరల ప్రకారం ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయించగా, 2022 నాటికి దాదాపు రూ.2.50 కోట్లకు పెరిగాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ప్రాజెక్టును ఎలాగైనా ముందుకు తీసుకెళ్లాలన్న తలంపులో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఉన్నారు. కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి ఆయన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టును పరిశీలించారు. పాత టెండర్లను రద్దు చేసి, కొత్తగా అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు కలెక్టర్‌కు తెలిపినట్టు సమాచారం.

ప్రాజెక్టును పూర్తిచేయాలి

గొర్రెపాటి వెంకట రమణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్, ఘంటసాల

ఘంటసాల చారిత్రక ప్రాంతం. ఇక్కడ శైవం, బౌద్ధం రెండూ పరిఢవిల్లాయి. చుట్టుపక్కల ఎక్కడ చూసినా చారిత్రక ఆనవాళ్లుంటాయి. ఇక్కడున్న బౌద్ధ స్థూపాన్ని చూసేందుకు, ఆరామం వద్ద ప్రార్థనలు చేసేందుకు నిత్యం బౌద్ధ ఆరాధకులు వస్తుంటారు. 2018లో దాదాపు 640 మంది బౌద్ధ సన్యాసులు వివిధ దేశాల నుంచి వచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

కొత్తగా అంచనాలు రూపొందించాం

జి.రామలక్ష్మణరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి కొద్దిరోజుల క్రితం ఘంటసాల శయన బుద్ధ ప్రాజెక్టును సందర్శించాం. వారి సూచనల మేరకు రూ.5కోట్లతో మళ్లీ అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. మరిన్ని సౌకర్యాలు జతచేస్తూ ఈ ప్రతిపాదనలు రూపొందించాం. ప్రభుత్వం నుంచి త్వరలోనే ఆమోదం వస్తుందని ఆశిస్తున్నాం.



విద్యుల్లతకు శుభాకాంక్షలు తెలుపుతున్న పట్టణ ప్రణాళికా సంఘం నేతలు

ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలు భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు

● రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకురాలు విద్యుల్లత

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా ఉంటే భవిష్యత్తు తరాలకు బంగారు బాటలుగా నిలిచి ఎంతో మేలు చేస్తాయని రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకురాలు ఆర్.జె.విద్యుల్లత అన్నారు. ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని టౌన్, కంట్రీ ప్లానింగ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్‌బాబు తదితరులు శుక్రవారం రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకురాలు ఆర్.జె.విద్యుల్లత, అదనపు సంచాలకుడు శ్రీనివాసులు జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి కె. ప్రభాకర్ రావు, తదితర సంచాలకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం కేక్‌కట్ చేసి ఆనందోత్సాహాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యుల్లత మాట్లాడుతూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో పట్టణ ప్రణాళిక శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. చిన్న నగరాలు మెట్రో నగరాలుగా రూపాంతరం చెందుతూ మహానగరంలా ఆరేందుకు పట్టణ ప్రణాళిఖాధికారులు, సిబ్బంది ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మునిసిపాలిటీ, కార్పొరేషన్, మహానగరాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనేక ఒత్తిడిలకు గురవుతూ, అరకొర సిబ్బందితో తీవ్రమైన పనిభారంతో పనిచేస్తున్నారని, వారిని కృషిని ఆమె అభినందించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణాలు, నగరాల అభివృద్ధికి రహదారుల విస్తరణతో పాటు అనేక నగరాల రూపకల్పనలో పట్టణ ప్రణాళిక అధికారుల కృషి ఎనలేనిదన్నారు. పట్టణ ప్రణాళిక సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు బేగ్, కోశాధికారి కృష్ణ, రాజ్యలక్ష్మి, ఏపీవో పి.నాయుడు, టీపీవో సీఆర్‌డీఏ శైలజ, సంజీవ్ రత్నకుమార్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి విశేష అర్చనలు



సహస్ర లింగార్చనలో పాల్గొన్న ఈవో

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామికి విశేష అర్చనలు జరిగాయి. రానున్న సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రాభిషేకం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతాయని, రూ.2వేలు చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని రామారావు తెలిపారు. అలాగే రోజువారీ నిర్వహిస్తున్న సహస్రలింగార్చనను శుక్రవారం అర్చకులు నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామారావు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ఊంజల్ సేవ అనంతరం సహస్ర దీపాలంకరణను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గంగా, పార్వతీ మల్లేశ్వరుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ

దుర్గగుడిలో కనకదుర్గమ్మ, మల్లేశ్వరస్వామి దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వారిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులకు అమ్మవారి శీఘ్ర దర్శనం అయ్యేందుకు ఏర్పాట్లు చేశారు. పలువురు భక్తులు ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చండీ హోమం, వంటి సేవల్లో పాల్గొన్నారు.

కళావేదికపై సంగీత విభావరి

కళావేదికపై విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార భక్త బృందం భక్తి సంగీతం నిర్వహించింది. పప్పు సదాశివశాస్త్రి శిష్య బృందం భక్తి సంగీత కచేరిలో పాల్గొంది. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై చావలి కృష్ణమోహన్‌లు సహకరించారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళా బృందాన్ని ప్రశంసించి ప్రసాదం, చిత్రపటం, ప్రశంసా పత్రాలను అందజేశారు. ముఖ్య అర్చకులు చెరువు ఆదినారాయణ యాంకర్‌గా వ్యవహరించారు.



మహిళలకు గాజుల పంపిణీ

దుర్గగుడిలో శుక్రవారం మహిళలకు అమ్మవారికి అలంకరించిన గాజులను ఈవో రామారావు పంపిణీ చేశారు. ఉచితంగా పుస్తకాలనూ అందజేశారు. గాజులు తీసుకోవటానికి మహిళలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపించారు. ఇటీవల నిర్వహించిన గాజుల ఉత్సవంలో అమ్మవారికి అలంకరించిన గాజుల పంపిణీతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదాన నిమిత్తం శుక్రవారం హైదరాబాద్ రాయదుర్గానికి చెందిన కె.రామకృష్ణ రూ.1,00,116 విరాళం అందజేశారు. అధికారుల ద్వారా విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదాశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, పుస్తకాలు అందజేశారు.

ప్రశ్నించడమంటే ఏమిటి జగన్ రెడ్డీ?

● టీడీపీ నేత గన్నే ప్రసాద్

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించడమంటే ఏమిటో సైకో జగన్ రెడ్డి చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) శుక్రవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. జగన్ సైకో టెర్రర్ సోషల్ మీడియా చేతిలో అతడి తల్లి, చెల్లీ బాధితులేనన్నారు. సోషల్ మీడియాలో అవమానకర పోస్టింగ్‌లు భరించలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చట్టసభలో వైసీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబు సతీమణిపై కారుకూతలు కూసినప్పుడు జగన్ వికృతంగా చిరునవ్వులు చిందించిన అంశం ప్రతి తెలుగువారి కళ్లల్లోనూ మెదులుతూనే ఉందన్నారు. జగన్ నీచబుద్ధి చూసి ప్రజలు ఛీ కొట్టారనే అక్కసుతోనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిల్లలు, లోకేష్, మహిళా మంత్రులపై జగన్ సైకో టెర్రర్ సోషల్ మీడియా బరితెగించి చేస్తున్న వికృత పోస్టులకు చట్ట ప్రకారం ప్రభుత్వం తప్పకుండా బుద్ధి చెబుతుందన్నారు.

వైసీపీని భూస్థాపితం చేస్తేనే మేలు: లుక్కా

వైసీపీని భూస్థాపితం చేస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావటంతో ఎమ్మెల్సీ బరి నుంచి జగన్ రెడ్డి తప్పుకున్నాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ రెడ్డి డిగ్రీ చదవని వ్యక్తుల పేర్లను ఓటర్లుగా చేర్చి ఎన్నో అక్రమాలకు పాల్పడినా రాయలసీమలో 2, ఉత్తరాంధ్రలో 1 చొప్పున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాభవాన్ని గుర్తించి తోకముడిచాడని విమర్శించారు. వర్రా రవీంద్ర రెడ్డి పోస్టుల గురించి వివరిస్తూ జగన్ రెడ్డి ఎలాంటి స్పందన లేకుండా వికృత ఆనందం పొందాడన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

మురుగుకాల్వలోకి దూసుకెళ్లిన నాన్‌స్టాప్

పెదపారుపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నుంచి విజయవాడ వెళ్తున్న నాన్ స్టాప్ బస్సు గుంటను తప్పించబోయి మురుగు కాల్వలోకి దూసుకెళ్లిందని గుడివాడ డిపో మేనేజర్ జి.రాజేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. గుడివాడ నుంచి విజయవాడ వెళ్లే నాన్ స్టాప్ బస్సు వానపాముల చిన్న వంతెన దగ్గర గొయ్యిని తప్పించబోయి మురుగు కాల్వలోకి దూసుకెళ్లిందన్నారు. బస్సులో 18 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నాయని, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడని ఆయన పేర్కొన్నారు.



కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు

కొండాలమ్మకు ఘనంగా పుష్పార్చన

గుడ్లవల్లేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ దేవస్థానం 16వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు దంపతులు పుష్పార్చన నిర్వహించారు. ఆలయ మాజీ ఛైర్మన్లు తాళ్లూరి మాధవ, బెల్లంకొండ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస పూజలు

కూచిపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదపూడి శివాలయంలో నిర్వహించిన కార్తీక పూజల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్తీక వనసమారాధన, అన్నదాన కార్యక్రమంలో కుమార్ రాజా పాల్గొన్నారు. కోసూరు సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి ఇరుముడుల కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, తాతా ప్రభాకర్‌రావు, పెద్ద మస్తాన్‌పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ 15వ వార్షికోత్సవం

గుడివాడ రూరల్: నియోజకవర్గంలో మోటూరు గంగానమ్మ తల్లి దేవాలయం అత్యంత ప్రాశ్యస్థమైన దేవాలయమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగానమ్మ తల్లి 15వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవటం సంతోషంగా ఉందన్నారు. మోటూరు గ్రామంలో అమ్మవారు ఎప్పుడు కొలువై ఉండటం వల్ల ప్రశాంత వాతావరణం ఉంటుందని ఆయన తెలిపారు. మండల దేశం పార్టీ అధ్యక్షులు వాసే మురళీ, గ్రామదేశం పార్టీ అధ్యక్షులు చీకటి శేషగిరి, ఆలయ కమిటీ భక్త బృందం, మోటూరు గ్రామస్థులు, భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

పామర్రు, నవంబరు 8 : సీసీ రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బల్లిపర్రు సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు తమ్మారెడ్డి సంజీవరావు అన్నారు. ఎస్సీ కాలనీకి మంజూరైన రూ.30లక్షల నిధులతో నిర్మించే సీసీ రహదారుల నిర్మాణ పనుల్లో భాగంగా జంగిల్ క్లియరెన్సు పనులు ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కూమార్ రాజా తీసుకున్న చర్యలకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ నేతలు కొసరాజు వేంకటేశ్వరరావు, నిమ్మగడ్డ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐ సుస్మితతో మద్యం అక్రమ దుకాణాలపై వివరిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు



వైద్యుడిని నియమించాలని కోరుతున్న పెదవిరివాడ గ్రామస్థులు

మండల సమావేశాల్లో సమస్యలు ఏకరువు

గుడ్లవల్లేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలకోసారి జరిపే మండల సమావేశాల్లో ఆయా శాఖలపై సమీక్షకు అధికారులు హాజరు కాకుంటే మెమోలు ఇచ్చి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో సారథి అన్నారు. గుడ్లవల్లేరు మండల సమావేశం శుక్రవారం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, ఆర్ అండ్ బీ, పోలీస్, సహకార శాఖల అధికారులు హాజరుకాకపోవడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే సంబంధిత శాఖలకు వెంటనే కార్యాలయ ఏవోతో ఫోన్ చేయించారు. దాంతో పోలీసు శాఖ నుంచి ఏఎస్సై వచ్చారు. శాఖల వారీ సమీక్షలో ఎక్సైజ్ ఎస్సై సుస్మిత పాల్గొన్నారు. నూతన మద్యం పాలసీలో మండలంలో ఏర్పాటు చేసిన ఆరు మద్యం దుకాణాల వివరాలు తెలిపారు. బెల్టు పెచ్చుమీరాయని, డోకిపర్రులో నివాసాల మధ్య మద్యం దుకాణానికి అనుమతివ్వడంతో ప్రజలు వ్యతిరేకిస్తున్నారని వైస్ ఎంపీపీ శాయిన రవి కుమార్ అన్నారు. కౌతవరంలో బెల్టు షాపు నిర్వాహకులను అరెస్టు చేసి దుకాణం మూయించామని సుస్మిత చెప్పారు. గ్రామాల్లో నరేగా నిధులు రూ5.30 కోట్లతో 78 రహదారులు నిర్మిస్తున్నామని పంచాయతీరాజ్ జేఈ నాగేశ్వరరావు చెప్పారు. శ్మశాన వాటికల్లో షెడ్ల నిర్మాణానికి ఒక్కో పంచాయతీకి రూ 5 లక్షలు నిధులు మంజూరై ఉన్నా, వాటిని ఎందుకు కేటాయించడం లేదని చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు ప్రస్తావించగా, డిశంబరులో ఆ నిధులు మురిగి పోతున్నాయని, అందుకే వాటిని సభ దృష్టికి తీసుకురాలేదని జేఈ అన్నారు. ఇంకా 50 రోజులు సమయం ఉంది కదా.. వృథాగా నిధులు పోనివ్వడం ఎందుకని, వెంటనే నాలుగైదు రోజుల్లో అంచనాలు రూపొందించి, వర్క్స్ కమిటీలు ఏర్పాటు చేసి పనులు ప్రారంభింపచేయాలని ఎంపీడీవో ఆదేశించారు. తహసీల్దార్ లోకరాజు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామానికి వైద్యాధికారి కావాలి

నందివాడ : తమ గ్రామానికి వైద్యాధికారిని నియమించాలని పెదవిరివాడ గ్రామసర్పంచ్ గూడపాటి రవి, పెదవిరివాడ గ్రామస్థులు శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పెయ్యేల ఆదాం, ఎంపీడీవో మల్లేశ్వరికి వినతిపత్రాన్ని అందజేశారు. గూడపాటి ఇస్సాకు మాట్లాడుతూ గతంలో తమ గ్రామానికి ప్రభుత్వ వైద్యుడు ఉండేవారని, ప్రస్తుతం కనీసం ఏఎన్ఎం కూడా రావటం లేదని అన్నారు. పంచాయతీ తీర్మానం చేసి ఊరికి ప్రభుత్వ వైద్యాధికారిని నియమించాలని కోరారు. ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతుండగా, రామాపురం సర్పంచ్ కాకరాల సురేష్ లేచి కాల్వలో డ్రాప్‌లు పూడ్చటం లేదన్నారు. ప్రతి గ్రామసభలో చెప్పినా మాటలకే పరిమితమవుతుందని, పనులు జరగటం లేదన్నారు. ఎంపీపీ ఆదాం మాట్లాడుతూ, రోడ్లపై కంపలు తొలగించటానికి, కాల్వలో తూడు తొలగించటానికి టెండర్లు వేయటమే కానీ, ఎక్కడ పనులు అక్కడే ఉంటున్నాయన్నారు. తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామపంచాయతీలు వెలవెలబోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్లు, ఫిల్టర్ బెడ్‌లు రిపేర్ల నిమిత్తం ప్రత్యేక గ్రాంటు విడుదల చేయటంతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రజల దాహార్తి తీర్చే విధంగా చర్యలు చేపట్టారన్నారు. శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద కందిపప్పుకు రూ.3లు, పంచదారకు రూ.3లు ఎక్కువ తీసుకుంటున్నారని తహసీల్దార్‌కు వివరించారు. ఎంఈవో-2 డేవిడ్ రత్నరాజు మాట్లాడుతూ పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీలను మార్చాలంటూ కొంతమంది నాయకులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈవోపీఆర్డీ మీరా మీర్జా బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందజేయటంలో మండలం ప్రథమ స్థానంలో ఉందని, ఇంటి పన్ను వసూళ్లు చేయటంలో జిల్లా 19వ స్థానంలో ఉందన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తహసీల్దార్ రఘురామరెడ్డి, వైస్ ఎంపీపీలు జయరాజు, సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ తనిఖీలు

గుడివాడ: విద్యుత్‌ను అనధికారికంగా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ సూపరిటెండెంట్ అల్ఫాన్స్ అన్నారు. శుక్రవారం గుడివాడ టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని నందివాడ మండలంలో తనిఖీలు నిర్వహించారు. గృహ, వాణిజ్య ఆక్వా సర్వీసులను పరిశీలించి అదనపు లోడును గుర్తించి రూ.5.81లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే కేసులు నమోదు చేసి జరిమానాతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిలున్నవారు తక్షణం చెల్లించని పక్షంలో సర్వీసులకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని అల్ఫాన్స్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్ వాసు, గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు

గుడివాడ రూరల్: మండలంలో జరిగే అభివృద్ధి పనులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జాగ్రత్తగా చేపించాలని ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో అధ్యక్షతన జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకంపనుల ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పంచాయతీ రహదారులకు ఉపాది హామీ పథకం ద్వారా పనులు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పర్యవేక్షించాలని కోరారు. ప్రతీ గ్రామంలో ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో చర్చించి పనులు నిర్వహించాలని తెలిపారు. అభివృద్ధి పథంలో మండలాన్ని నడిపించటానికి ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో ముఖ్య మన్నారు. ఈవోపిఆర్‌డి శ్రీనివాసరావు, గుడివాడ పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి. వై.విష్ణుప్రసాద్

సర్వే సమర్థవంతంగా చేయాలి :ఎంపీడీవో

పెదపారుపూడి: నైపుణ్య సర్వే చేయు విధానాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని నాణ్యతగా వేగవంతంగా ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపల పూర్తి చేయాలని పెదపారుపూడి ఎంపీడీవో టి.సీతా మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీల కార్య దర్శులకు, గ్రామ సచి వాలయాల సహాయకులకు శిక్షణ కార్య క్రమం జరిగింది. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ లలో ఇంటింటికి ఈ సర్వే చేయవలసి ఉంటుందని, నైపుణ్య గణన ఇప్పుడున్న మానవ వనరుల నైపుణ్య స్థితిని తెలపటంతోపాటు నైపుణ్య శిక్షణార్థుల వివరాలు కూడా తెలుపుతుందన్నారు. తద్వారా వారికి అవసరమైన శిక్షణను అందించి వారి జీవనోపాధులను మెరుగుపర్చటమే ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు. నాన్ టెక్నికల్ ఆఫీసర్ రాజేష్ శిక్షణను పర్యవేక్షించగా, ట్రైనర్‌గా విజయ్ కుమార్ వ్యవహరించారు. ఈవోపిఆర్‌డి వంగా శ్రీనివాస్, వివిధ పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు,9 సచివాలయాల సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టి.సీతామహాలక్ష్మి

రైతే రారాజు : ఎమ్మెల్యే వర్ల

పెదపారుపూడి: వైసీపీ ప్రభుత్వంలో రైతు ధాన్యం అమ్మాలంటే రైతు భరోసా కేంద్రం ద్వారా అనేక ఇబ్బందులతో ధా న్యం అమ్మేవారు కానీ ధాన్యం డబ్బు లు రైతు ఖాతాల్లో ఎన్నో నెలలకి పడే వి. కానీ తెలుగుదేశం ప్రభుత్వంలో రైతే రారాజు అని భావిస్తూ ధాన్యం కొను గోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. మండల పరిదిలోని వెంట్రప్రగడ గ్రామంలో సోమేశ్వ రస్వామి దేవ స్థానంలో విజయధార రైతు ఉత్ప త్తిదారుల కంపెనీ లిమిటెడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతీ ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి, అమ్మి మోసపోవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఏడి రమాదేవి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి , మాజీ ఎంపీపీ పూనుకొల్లు వెంకట రత్న ప్రసాద్, ఛైర్మన్ సుబ్బారావు, సుబ్బయ్య, గొరిపర్తి రవికుమార్, మాయ విజయబాబు, కాటన్ రాజు, కిషక్టర్, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, తహసీల్దార్ రంగారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కుమార్‌రాజ

ఆర్థిక సాయం

గుడివాడ : ఇటీవల ప్రమాదావశాత్తు హ్యాండ్ కట్టర్ కాలుకి తగిలి తమ్మిశెట్టి సరసింహారావు అనే కార్మికునికి గాయమైంది. శుక్రవారం సదరు కార్మికునికి సిఐటియు అనుబంధ ది కృష్ణాజిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు ఆంజనేయులు, రషీద్ బేగ్, మొహిద్దీన్, నాగరాజు, ఉపేంద్ర, గాంధీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న నేతలు

14న ప్రజాపోరుయాత్ర

గుడివాడ, : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాపోరు యాత్రను నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 14వ తేదీన మండల కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి వినతిప్రతం అందజేయనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాపోరుయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రజిని, ఎల్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలు పంపిణీ

తోట్లవల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి కుమారుడు వెంకట హరి పవన్ శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తోట్లవల్లూరు లయన్స్ క్లబ్‌లో 60 పేదలకు అన్నదానం, వస్త్రాదానం చేశారు. తెలుగు యువత కార్యకర్తలు, హరి ఫ్రెండ్ సర్కిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్లను అప్రదిష్టపాల్జేసేందుకు కుట్ర

తోట్లవల్లూరు : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను అప్రదిష్టపాల్జేసేందుకు వల్లూరుపాలేనికి చెందిన చెన్నుపాటి శ్రీధర్ కుట్రలు చేస్తున్నాడని మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ఆరోపించారు. మండలంలోని కుమ్మమూరులో శుక్రవారం సాయంత్రం వివిధ గ్రామాల టీడీపీ అధ్యక్షులు, నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివరామ్ మాట్లాడుతూ శ్రీధర్‌ని పోలీసులు పిలవటానికి ఎమ్మెల్యే కుమార్ రాజాకుగాని, తనకు గాని, పార్టీకి గాని ఎలాంటి సంబంధం లేదన్నారు. రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నాడన్నారు. వైసీపీ నేత నరేంద్రరెడ్డితో కలిసి ఇసుక వ్యాపారం చేశాడని ఆరోపించారు. మండల పార్టీ యావత్తు శివరామ్‌కు, ఎమ్మె ల్యే కుమార్‌రాజాకు అండగా నిలుస్తుందన్నారు. సమా వేశంలోసర్పంచ్ మూడే శివశంకర్, ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, ఉప సర్పంచ్ వీరంకి పరశురామ్, మాజీ వైస్ ఎంపీపీ వీరంకి వరహాలరావు, నాయకులు లుక్కా రేణుకారావు, కళ్ళం వంశీకృష్ణారెడ్డి, ఉప్పులూరి గోపాలకృష్ణ, నెక్కలపూడి మురళీ, పాముల ప్రకాష్, గొరిపర్తి గోపయ్య, చొప్పరపు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరపనేని శివరామ్

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

చేపలు వేటాడుతూ మత్స్యకారుడు మృతి



మేడా కృష్ణారావు

నాగాయలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చేపలు వేటాడుతూ ప్రమాద వశాత్తు కృష్ణానదిలో పడి గురువారం రాత్రి మేడా కృష్ణారావు (48) మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కృష్ణారావు టీడీపీ సీనియర్ కార్యకర్త. ఆయన మృతికి టీడీపీ మత్స్యకార సంఘాల నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, నడకుదుటి జనార్ధనరావు, కొల్లూరి వెంకటేశ్వర రావు, చిలకలపూడి పాపారావు, నాగిడి తాతారావు, ఒడుగు సాంబశివరావు, నాగిడి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న కొనకళ్ల, రామకృష్ణ

తక్కువ ధరకే జనరిక్ మందులు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోగులకు తక్కువ ధరలకే మందులు అందించేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జనరిక్ మెడికల్ షాపు ప్రారంభించినట్టు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును నారాయణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్, అంగర తులసీదాస్, బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

తుంగలవారిపాలెం సమీపంలో సుమంత్ మృతదేహం



బొడ్డు సుమంత్ (ఫైల్)

అవనిగడ్డ/చల్లపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా ఆచూకీ లేకుండా పోయినా చల్లపల్లి మండలం నిమ్మలతోటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొడ్డు సుమంత్ మృతదేహాన్ని అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెం వద్ద కృష్ణానదిలో పోలీసులు గుర్తించారు. మూడు రోజుల క్రితం స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వచ్చిన సుమంత్ కనిపించకుండా పోయాడు. బైక్, సైకిల్, పర్సు, ఫోన్ పులిగడ్డ - పెనుమూడి వారధిపై లభించాయి. దీంతో సుమంత్ నదిలో దూకి ఉంటాడనే అనుమానంతో రెండు రోజులుగా గాలింపు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మృతదేహాన్ని తుంగలవారిపాలెం వద్ద గుర్తించారు. సుమంత్ మృతదేహాన్ని చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, అవనిగడ్డ ఎస్సై యువకుమార్, ఎస్సై శ్రీనివాస్‌లు బయటకు తీయించి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. సుమంత్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మురుగు సమస్యను ప్రస్తావిస్తున్న టీడీపీ కౌన్సిలర్ నాగరాము, కూటమి పాలనలోనే మురుగు వచ్చిందంటున్న వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న

మురుగుతో తాగునీరు కలుషితం

• కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వాడివేడిగా జరిగింది. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ప్రజలకు తాగునీరందించే వాటర్ ఫిల్టర్స్ నిండా మురుగు చేరడంపై టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్ ప్రశ్నించారు. నాలుగేళ్లుగా వాటర్ ఫిల్టర్లు శుభ్రం చేయకపోవడంతో పెద్ద ఎత్తున బురద పేరుకుపోయిందని, దీంతో కుళాయిల్లో కలుషిత నీరు వస్తోందని టీడీపీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ హయాంలో పాలన బాగానే ఉందని, కూటమి పాలనలోనే ఇలా బురద నీరు కుళాయిల్లోంచి వస్తోందని వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న అనడంతో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. వైసీపీ పాలన బాగుంటే రాష్ట్రస్థాయిలో 11 సీట్లకే ఎందుకు పరిమితమయ్యారని టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము ఎదురుదాడికి దిగారు. మడుగు పోరంబోకులో ఇళ్లు వేసుకోవడానికి అవకాశం లేదని, అయినా నిత్యం నీటి మధ్య ఉండే స్థలంలో పేదలకు ఇళ్లు వేసుకోమని వైసీపీ పాలకులు చెప్పడం చాలా అన్యాయమని మరోసారి టీడీపీ కార్పొరేటర్‌లు విమర్శించారు. టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో కౌన్సిల్‌హాలులో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మురుగును తోడేందుకు పైపులు, పంపులు ఉపయోగించడంతో పాటు ట్రాక్టర్‌ను కూడా దించడం ఏమిటని వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు తమను సంప్రదించకుండానే పనులు చేస్తున్నారని, టెండర్లు పిలిచేస్తున్నారని మేయర్ వెంకటేశ్వరమ్మ, వైసీపీ కార్పొరేటర్లు అనడంతో సభలో కలకలం రేగింది.

అజెండాలోని ఆరు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 17వ డివిజన్‌లో రోడ్డును ఎత్తు చేసేందుకు రూ.2.82 లక్షల పనులకు ఆమోదం తెలిపారు. ఇనకుదురుపేటలో ఒక వీధికి అమరవీరుడు షేక్ హాజీ హుస్సేన్ పేరు పెడుతూ ఆమోదం తెలిపారు. రూ. 34.9 లక్షలతో పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు.

బకాయి జీతాలు చెల్లించండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ 104 సిబ్బంది, నాయకులు శుక్రవారం ఎంపీడీవో వెంకటేష్, తహసీల్దార్‌ల శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, సురేష్, సతీష్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. 2020 తరువాత విధుల్లోకి తీసుకున్న డ్రైవర్లకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలన్నారు.

దేవాలయాల్లో మనగుడి

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా జిల్లాల్లోని వివిధ ప్రధాన దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనలు, ప్రముఖుల ఉపన్యాసాలు ఏర్పాటు చేసినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సి.వి.కె. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 11 నుంచి నిర్వహించనున్న ధార్మిక కార్యక్రమాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సి.వి.కె. ప్రసాద్ మాట్లాడుతూ, 11న జోస్యుల వేణుమాధవ ప్రసాద్, 12, 13, 14, 15 తేదీల్లో ముత్తేవి శ్రీనివాస శశికాంత్, 16, 17 తేదీల్లో కొడాలి సోమసుందర రావు ఉపన్యాసాలు ఏర్పాటు చేశామన్నారు.



జాతీయ స్విమ్మింగ్ పోటీలకు నాగాయలంక విద్యార్థులు

నాగాయలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. నాగిడి అశ్విని 50 మీటర్ల విభాగంలో ద్వితీయ, 200 మీటర్ల విభాగంలో తృతీయ స్థానాలు సాధించగా, కొక్కిలిగడ్డ విన్ని 100 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీడీలు గాజుల లక్ష్మీ ప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు తెలిపారు.

సమస్యలపై పోరాటం : సీపీఎం

మోపిదేవి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాల్సిందిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. సీపీఎం మోపిదేవి మండల 8వ మహాసభ శుక్రవారం నాగాయితిప్ప గ్రామంలో జరిగింది. నరసింహారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మండల కార్యదర్శిగా బండి ఆదిశేషు, సభ్యులుగా కర్రా వెంకటేశ్వరరావు, బెజవాడ నాగేశ్వరరావు, పులివర్తి నాగమల్లి, సిహెచ్.రాజశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ గోవర్ధన్‌కు సత్కారం

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అభివృద్ధికి ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ అందిస్తున్న సేవలు మరువలేనివని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ నియోజకవర్గ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. మండల పార్టీ కార్యదర్శి కర్రా సుధాకర్, ఎస్సీ సెల్ నేతలు మేడికొండ విజయ్, కొల్లూరి వాసు, తండు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ కోర్టు వద్ద నేషనల్ లీగల్ సర్వీస్ డే నిర్వహిస్తున్న న్యాయమూర్తి బాబూనాయక్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌరుడు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్ అన్నారు. నేషనల్ లీగల్ సర్వీస్ డేను పురస్కరించుకుని అవనిగడ్డ కోర్టు సముదాయం వద్ద న్యాయవాదులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

15 మందికి సీఎం సాయం

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గానికి చెందిన 15 మందికి రూ.14.57 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. పేదల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న అరుణ సారిక

జాతీయ న్యాయ సేవా దినోత్సవ ర్యాలీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ న్యాయ సేవా దినోత్సవం శనివారం జరగనున్న దృష్ట్యా మచిలీపట్నం జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా గోపుర ప్రతిష్ఠ

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొట్లేలుగుంటాయిపేట రుక్మిణీ సత్యభామ సమేత మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం ధ్వజదండ విమాన గోపుర ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతన స్వామి, కాసగాని శ్రీనివాసరావు, గోపీ నాగబాబు, బత్తిన దాసు, ఎస్ఏ బేగ్, ఎంపీటీసీ గంజాల చింతలమ్మ, సిరివెళ్ల శ్రీను, జన్ను ప్రసాద్, బత్తిన రామకృష్ణ, పోతుల రాము, సర్పంచ్ మహమ్మద్ రఫీ, వాకా శ్రీను, గంజాల గోవర్ధన్, తోట వేణు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై అవగాహన

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా, బాలల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. అవనిగడ్డ నారాయణ పాఠశాలలో విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంటుమిల్లి కాల్వకు నీరివ్వాలి

బంటుమిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాల్వకు నీరు విడుదల చేసి దాళ్వా సాగుకు అనుమతించాలంటూ బంటుమిల్లి తహసీల్దార్ భరత్ రెడ్డికి రైతులు అర్జీ ఇచ్చారు. అంబేద్కర్ సెంటర్ నుంచి బంటుమిల్లి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. గౌరిశెట్టి నాగేశ్వరరావు, మలిశెట్టి శివరామ్ ప్రసాద్, అజయ్‌ఘోష్, ఏసుబాబు, పుప్పాల నరసింహారావు, వెంట్రపాటి సురేష్, శివశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శొంఠి నాగరాజు సత్కారం

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన శొంఠి నాగరాజును జి కన్వెన్షన్ హాలులో శుక్రవారం కాంగ్రెస్ బీసీ నాయకులు ఘనంగా సత్కరించారు. గొల్లు కృష్ణ, మొవ్వ మోహనరావు, అబ్దుల్ మతీన్, ఫణిభూషణ్, మస్తాన్ వలి, నరహరిశెట్టి నరసింహారావు, ఎస్. బాబ్జీ, బొర్రా కిరణ్ తదితరులు పాల్గొన్నారు



ముంజులూరుపాల ఉత్పత్తిదారులతో మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయం

• కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

బంటుమిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధే ధ్యేయమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ముంజులూరు పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘాన్ని శుక్రవారం ఆయన సందర్శించి పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నామన్నారు. కృత్రిమ గర్భోత్పత్తి సేవలు రూ.50 లకే అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలకవర్గ సభ్యులు, జడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు కూనపరెడ్డి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ చొప్పకట్ల వరప్రసాద్, కార్యదర్శి నాగర్జున, టెస్టర్ మేరి, పాల ఉత్పత్తిదారుల పాల్గొన్నారు.



జింజేరు పాల కేంద్రం సందర్శన

పెడన రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు కృష్ణా మిల్క్ యూనియన్ తోడ్పడుతుందని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. జింజేరు పాల ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతుల సంక్షేమ పథకాలను వివరించారు. పశువులకు సబ్సిడీపై పోషక విలువలతో కూడిన దాణా అందిస్తున్నామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, మేనేజరు తోట సత్యన్నారాయణ, మోతుకూరి మాతా మోహనరావు, ప్రసాద్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.